క్లుప్తంగా

ఉద్యోగ మేళాకు చక్కటి స్పందన



ఎంపికైన అభ్యర్థులతో నాగశంకర్, సర్పంచ్ కనక మల్లీశ్వరి

కె.కోటపాడు: గొండుపాలెంలో అపోలో ఫార్మసీ సహకారంతో సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు మంచి స్పందన లభించింది. గొండుపాలెంతో పాటు సమీప గ్రామాలకు చెందిన 146 మంది ఉద్యోగార్థులు ఫార్మసీ ట్రైనీ, ఫార్మసీ అసిస్టెంట్, ఫార్మసిస్ట్ పోస్టుల ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి రీజనల్ హెచ్ఆర్ నాగ శంకర్, హెచ్ఆర్ అప్పలరాజు ఇంటర్వ్యూలు నిర్వహించి వీరిలో 60 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 30 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బండారు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాకవరపాలెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని బూరుగుపాలెం సమీపంలో ఉన్న జాజిగెడ్డ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో సోమవారం రాత్రి దాడి చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. ఈ దాడిలో ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నాతవరం మండల పార్టీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

నాతవరం: అంకితభావంతో పని చేసే ప్రతి వ్యక్తికి వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. నాతవరం మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా పీకేగూడెం సర్పంచ్ లగుడు నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంత వరకు పని చేసిన పూర్వ అధ్యక్షుడు పైల పోతురాజును సత్కరించారు. తర్వాత నూతన అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావును సత్కరించి అభినందించారు. నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు

కె.కోటపాడు: పింద్రంగి, ఎ.కోడూరు గ్రామస్తులు మంగళవారం గ్రామదేవతల పండగలను ఘనంగా జరిపారు. ఎ.కోడూరులో మోదకొండమ్మ, పింద్రంగిలో పైడితల్లమ్మ అమ్మవారి పండగలు నిర్వహించారు. పింద్రంగిలో అమ్మవారికి వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ, సర్పంచ్ వేచలపు దొరబాబు తదితరులు పూజలు చేశారు.

ఆరు పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు

మాకవరపాలెం: మండలంలోని ఆరు కొత్త పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. మండలంలో గతంలో 25 పంచాయతీలు ఉండగా వాటిని 31 పంచాయతీలుగా విభజన చేశారు. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన అప్పన్నదొరపాలెం, మామిడిపాలెం, ముషిడిపాలెం, బి.ఎస్.పేట, చామంతిపురం, కె.తూటిపాల పంచాయతీల్లో దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిని ఆయా పంచాయతీలకు అప్పగించామన్నారు.

ఘనంగా శ్రీసన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగ

దేవరాపల్లి: దేవరాపల్లి రెల్లివీధికి ఎదురుగా వరదపురెడ్డి చిన్నంనాయుడు నగర్‌లో వెలసిన శ్రీ సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారి నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక ప్రజలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 4 గంటల నుండి అమ్మవారి ఒడ్డు పండగను మహిళల కోలాటం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ వైభవంగా జరిపించారు. భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంక్షేమ సంతకం

- నాలుగేళ్ల రాష్ట్ర ప్రభుత్వ పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు
- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి
- కేక్ కట్ చేసిన ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



కేక్ కట్ చేస్తున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ

రావికమతం: నాలుగేళ్ల సంక్షేమ పాలనలో రాష్ట్రం అన్నింటా అభివృద్ధి పథంలో నిలిచిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దేశవ్యాప్తంగా పలువురు మేధావులు ప్రశంసలు అందిస్తున్నారని అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గర్నికం గ్రామంలో ఎంపీ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి తండ్రి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కంటే మిన్నగా ప్రజా పాలన చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 50 మంది అర్హులైతే నలుగురికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారని, ఇప్పుడు అర్హత ఉంటే చాలు అందరికీ ఇస్తున్నారని, ఇది దేశానికే ఆదర్శనీయం అన్నారు. నాడు దయనీయంగా ఉండే స్కూల్ భవనాలు నాడు-నేడుతో రూపు రేఖలు మారాయని కార్పొరేట్ స్కూళ్లలా కన్పిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శనీయమని, తాను ఒక డాక్టర్‌గా అనుభవంతో చెబుతున్నానన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన రూ.2 లక్షల 60 వేల కోట్ల అప్పులతో రాష్ట్రం ఇచ్చినా, కరోనా వలన రాష్ట్రం రూ.లక్ష 60 వేల కోట్లు నష్టపోయినా ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి కేవలం సంక్షేమ విజన్ వలన నేరుగా పథకాలన్నీ లబ్ధిదారుల ఖాతాల్లోకి వేయడం వలన తలసరి ఆదాయం పెరిగిందన్నారు. రాష్ట్ర జీడీపీ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో పింఛన్ల పంపిణీకి రూ. 22 వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్‌మోహనరెడ్డి ఈ నాలుగేళ్లలోనే రూ. 98 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మళ్లీ మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం మనందరికీ ఉందన్నారు. సర్పంచ్ కేసంశెట్టి రాము నూకరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైఎస్‌ఆర్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీ ప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ. 1500 కోట్లు కేటాయింపు

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేరవేర్చడమే కాకుండా నియోజకవర్గానికి సీఎం అదనంగా రూ. 1500 కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు అయిన సందర్భంగా పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి సందడి చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ఉమ్మడి విశాఖ జిల్లా నాతవరం మండలంలోనే ప్రారంభమైందని, అప్పుడు ప్రజల కష్టాలు స్వయంగా చూసి ఇచ్చిన మాట ప్రకారం 98 శాతం హామీలన్నీ నేరవేర్చారన్నారు. ఏలేరు కాలువ, తాండవ ప్రాజక్టు అనుసంధాన పనులకు రూ. 470 కోట్లు, మాకవరపాలెం మండలంలో రూ. 500 కోట్లతో మెడికల్ కాలేజీ మంజూరు చేసి సీఎం శంకుస్థాపన చేశారన్నారు. అనుకున్న పనులు పూర్తయితే నియోజకవర్గాల రూపురేఖలు మారిపోతాయన్నారు. మండలంలో గల 31 గ్రామ పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో పూర్తి అయిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, సర్పంచులు, ఎంపీటీ సీలు పాల్గొన్నారు.

అందమైన లొకేషన్లపై సీఎంకు నివేదిక



సుందరకోట కొండపై సినిమా లొకేషన్లపై చర్చిస్తున్న జోగినాయుడు

నాతవరం: రాష్ట్రంలో సినిమా షూటింగ్‌ల చిత్రీకరణకు అనుకూలంగా ఉండే ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ఆయా ప్రాంతాల వివరాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి నివేదిస్తానని రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ (సినీ నటుడు) జోగినాయుడు అన్నారు. మండలంలో సుందరకోట కొండలపై మంగళవారం డైరెక్టర్ గవిరెడ్డి శ్రీనివాస్, సినీ హీరో అదర్స్ బాలకృష్ణ, విలన్ మకరంద్ దేశపాండే ఆధ్వర్యంలో కొత్తగా తీస్తున్న ఏజెన్సీ సినిమా షూటింగ్ సందర్భంగా జోగినాయుడు, అదర్స బాలకృష్ణ, డైరెక్టరు శ్రీనివాస్ ముచ్చటించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సినిమా షూటింగులకు కావలసిన అనువైన ప్రదేశాలు అనేకం ఉన్నాయని జోగినాయుడు అన్నారు. ఎమ్మెల్యే గణేష్‌కు కూడా సినిమా పరిశ్రమపై పూర్తి అవగాహన ఉందన్నారు. సినిమా పరిశ్రమకు సంబంధించి వచ్చే నెల 3న విశాఖలో కొందరు మంత్రులతో సమావేశం ఉందన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూర్యారావు

నర్సీపట్నం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు జిల్లా స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ ఎంతో దోహదపడిందని జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్.సూర్యారావు అన్నారు. నర్సీపట్నంలోని సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో రాణించటం వల్ల క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. పలు క్రీడల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, పారుపల్లి శ్రీనివాస్, సుమ, డైరెక్టర్లు శివ, రమ, కోచ్‌లు శేఖర్, పాపాని, మౌనిక, కోటిబాబు, పీడీ దేవి, ప్రియాంక, పి.వీరబాబు పాల్గొన్నారు.

చౌడువాడలో 11 మందిని గాయపర్చిన కుక్క



నూకాలమ్మ కాలిపై గాయపర్చిన కుక్క



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు



గాయపడ్డ గొల్లవిల్లి రాము

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 11 మందిని గాయపర్చింది. గ్రామంలో మంగళవారం తెల్లవారి పిచ్చికుక్క దాడి చేయడంతో నమ్మి గురయ్య, పి.ఇంద్ర, పి.లక్ష్మి, చుక్క నూకాలమ్మ, ఆకుల రాము, షేక్ మీరాభి, కె.శ్రీనివాసరావు, రాపేటి నాయుడు, జి.భీమేష్, కె.నూకాలమ్మ, గొల్లవిల్లి రాము గాయపడి చౌడువాడ పీహెచ్‌సీలో వైద్యం పొందారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కె.కోటపాడు సీహెచ్‌సీకి వెళ్లారు. పిచ్చికుక్కను ప్రజలు గ్రామం నుండి తరిమేశారు.

ఆధ్యాత్మికతతో ఐకమత్యం



నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ఐకమత్యం వెల్లివిరుస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో లక్కవరం, అంబేరుపురం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాల శంకుస్థాపన, కలశ పూజల్లో మంగళవారం ఆయన పాల్గొని పూజలు చేశారు. అంతకుముందు చోడవరం పట్టణంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు శీరంరెడ్డి వెంకటరమణ, కార్లె ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శరగడం నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి నాగదుర్గ గోవింద, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెహ్రూ, చోడవరం నాయీ బ్రాహ్మణులు సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడవ విడత రీసర్వే పనులు ప్రారంభం



కొత్తకోటలో రీ సర్వే పనులు చేస్తోన్న సిబ్బంది

రావికమతం: మండలంలో మూడవ విడతగా కొత్తకోట, గొంప, మేడివాడ, తట్టబంద, తోటకూరపాలెం, చలిసింగం గ్రామాల్లో జగనన్న సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమం మంగళవారం ప్రారంభం అయింది. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహేశ్వరరావు కోరారు. మండలంలో రెండు విడతల్లో ఇప్పటికి 19 గ్రామాల్లో సర్వే జరిగిందన్నారు. రెండవ విడత సర్వే చేసిన 8 గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీ చివరి దశలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, చినబ్బాయి, సర్వే సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ సర్వేపై విమర్శలు

రావికమతం: కొత్తకోట గ్రామంలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు సర్వే సిబ్బంది చేసిన మార్కింగ్ పలు విమర్శలకు తావిస్తోంది. రోలుగుంట మండలం వెలంకాయపాలెం నుంచి చోడవరం మండలం గంధవరం వరకూ రహదారి విస్తరించనున్నారు. ఇందుకుగాను చేసిన మార్కింగ్‌కు సంబంధించి మంగళవారం గర్నికం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ధర్మశ్రీ దృష్టికి పలువురు నాయకులు కొత్తకోట మార్కింగ్ విషయాన్ని తీసుకువచ్చారు. బీఎన్ రోడ్డులో నర్సీపట్నం నుంచి చోడవరం వరకూ అన్ని గ్రామాల్లో పదిహేనేళ్ల క్రితమే విస్తరణ జరగ్గా అప్పట్లో ఏదో కారణంగా కొత్తకోటలో ఆక్రమణలు తొలగించలేదన్నారు. గతంలోనే రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా చెరొక నలభై అడుగులకు మార్కింగ్ ఇవ్వాలని కలెక్టర్, ఆర్అండ్‌బి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఆ విధంగా సర్వే చేయాలని, విమర్శలకు తావీయొద్దని సిబ్బందికి సూచించారు.

తహసీల్దార్ కార్యాలయానికి చేరిన సర్వే రాళ్లు



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో దించుతున్న సర్వేరాళ్లు

రోలుగుంట: భూసర్వే జరిగిన భూముల సరిహద్దుల్లో పాతేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రెండవ విడతగా 915 రాళ్లు మంగళవారం వచ్చాయి. వీటిని భూ రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ ఎస్. నరేంద్రబాబు కార్యాలయ ఆవరణలో దింపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన అర్ల, చింతలపూడి, పనసలపాడు, ఎదుళ్లవలస, కురుప్రోలు, పెదపేట రెవెన్యూ గ్రామాల్లో గల భూముల సరిహద్దుల్లో రైతుల సమక్షంలో రాళ్లు పాతనున్నట్లు తెలిపారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు రేపు

దేవరాపల్లి: తామరబ్బ పంచాయతీ శివారు పల్లపుకోడాబులో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ తెలిపారు. గురువారం మధ్యాహ్నం నుండి ప్రారంభమయ్యే వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు వరుసగా రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు హాజరవుతారన్నారు.

ఘనంగా శ్రీకోటమ్మ తల్లి పండగ



అమ్మవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

నాతవరం: మండల కేంద్రంలో శ్రీకోటమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని దర్శనానికి మంగళవారం తెల్లవారి నుండే అధిక సంఖ్యలో భక్తులో క్యూలో నిల్చున్నారు. పసుపు, కుంకమ, చీర, జాకెట్టు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండగను పురస్కరించుకుని జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నాతవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి గోవింద్ బండి నిలిచింది. రెండవ స్థానంలో రెడ్డివాని పాలేనికి చెందిన పైడితల్లమ్మ బండి, మూడవ స్థానంలో పరవాడ అర్జున్‌గిరి బండి నిలిచింది. వీరికి వరుసగా రూ. 15 వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు అందజేశారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ సర్పంచ్ శెట్టి శ్రీను, వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టరు ఇట్టం శెట్టి సీతారామమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నర్సీపట్నం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. మంగళవారం ఒకటవ ర్యాంకు నుండి 12000 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు.

పాపయ్యపాలెంలో ఆధార్ క్యాంపు

మాకవరపాలెం: మండలంలోని పాపయ్యపాలెంలో ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపు ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పిల్లలు, పెద్దలు వచ్చి ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు. ఇక ప్రత్యేక క్యాంపులు లేని రోజుల్లో గిడుతూరు, బూరుగుపాలెం, రాచపల్లి సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

కె.కోటపాడు: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయం అధికారిణి పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు షటిల్ బ్యాట్మింటన్ పోటీలు నిర్వహించారు. అనంతరం నీతి కథలు వినిపించారు. పుస్తక పఠనం మంచి అలవాటు అని ఆమె తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నం: సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని కృష్ణాబజార్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావం నుండి దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్, సంఘటిత, స్కీమ్ వర్కర్ల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కె.నానాజీ, అప్పారావు, రాము, రాజు, అర్జున్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కృషి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వీబీ అగ్రహారంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్



గర్నికంలో ప్రజల సమస్యలు వింటున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ

మాడుగుల రూరల్: ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. కె.జె.పురం సచివాలయం-1 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్లలో పార్టీలకు అతీతంగా సీఎం జగన్ అందించిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించి, బుక్‌లెట్లు అందజేశారు. అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హైస్కూల్ పక్కనే ఉన్న సామూహిక మరుగుదొడ్లను పూర్తిగా తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, జెడ్పీటీసీ రమణమ్మ, వైస్ ఎంపీపీలు రాజారామ్, శ్రీనివాస్, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, ఆదారి కన్నారావు, అప్పలనాయుడు, కన్నబాబు, కాళ్ల జగన్, అమ్మతల్లినాయుడు, బీశెట్టి జగ్గ అప్పారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

నాతవరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం మండలంలో వీబీ అగ్రహారం, మాసయ్యపేట గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, మండల పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు, తహసీల్దార్ కనకారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, గన్నవరం, పీకేగూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, మిరపల వెంకటరమణ, కరక అప్పలరాజు, ఉలబాల శ్రీను, కాళ్ల సత్యనారాయణ, ఇట్టంశెట్టి శ్రీను, మంకు సాంబమూర్తి, ఎంపీటీసీలు తమరాన సత్యనారాయణ, పోలుపర్తి వెంకటరమణ, తమరాన లోవకృష్ణ, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

గర్నికంలో..

రావికమతం: సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని అనకాపల్లి ఎంపి భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. గర్నికం, కానాడ, పెదపాచిల గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీతో పాటు అనకాపల్లి ఎంపీ సత్యవతి ఇంటింటికీ తిరిగారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కోసం ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు, ఎమ్మెల్యే నిధుల నుంచి మరొక రూ.20 లక్షలు మంజూరు చేసి తక్షణం పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. గ్రామ సర్పంచ్ కేశంశెట్టి రాము నూకరాజు, ఎంపీపీ పైల రాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీ ప్రసాద్, ఎంపీడీవో వెంకన్నబాబు, గ్రామీణ తాగునీటి సరఫరా డీఈ కృష్ణ, గణేష్, ధనంజయరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ



హైస్కూలు భవనాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: నాడు నేడు కార్యక్రమంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కేజేపురం జిల్లా పరిషత్ హైస్కూలుకు రూ. 71.28 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్, హెచ్ఎం వి. దాసు, సర్పంచ్ రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, ఆదారి కన్నారావు, మళ్ల కన్నబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగకు ముందస్తు జాగ్రతలు తీసుకోండి

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ పండగ వచ్చే నెల 6న జరగనున్న సందర్భంగా అధికారులు ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంకాలం మండల స్థాయి అధికారులతో పాటు ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. విద్యుత్, పారిశుధ్య సమస్యలు, తాగునీటి సమస్యలు లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. వీధులు పరిశుభ్రంగా ఉంచడానికి బ్లీచింగ్ ఏర్పాటు చేసి, చెత్తా చెదారం లేకుండా జాగ్రతలు తీసుకోవాలని తెలిపారు. అంతకు ముందు మోదకొండమ్మ ఆలయంలో దాతలు, కమిటీ సభ్యుల సహకారంతలో సుమారు రూ. 6 లక్షలతో నిర్మాణం చేపట్టిన కల్యాణమండం, బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశు బీమాతో రైతులకు మేలు



రైతులకు పశు బీమాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చీడికాడ: వైఎస్ఆర్ పశు బీమా పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చీడికాడ పశువైద్యాధికారి గాయిత్రిదేవి తెలిపారు. మంగళవారం చీడికాడలో రైతులకు పశు బీమాపై అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు పశువు మృతి చెందినట్లెతై 21 రోజుల్లో బీమా సొమ్ము రైతు ఖాతాల్లో జమ అవుతుందన్నారు. ప్రతి రైతు తమ జీవాలకు బీమా చెయించుకోవాలన్నారు. మరిని వివరాలకు దగ్గరలోని ఆర్‌బీకేలో సంప్రదించాలని ఆమె కోరారు.

కల్యాణోత్సవాలకు అంకురార్పణ

మాడుగుల రూరల్: కేజేపురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 13వ వార్షిక కల్యాణోత్సవాలకు మంగళవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా పుట్టమట్టి తేవడం, నవకలశస్నపన, హోమాది కార్యక్రమాలు, నిజరూపదర్శనం, ధ్వజారోహ కార్యక్రమము నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు, కోశాధికారి పుట్టా బలరామమూర్తితో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. స్వామివారి తిరు కల్యాణం బుధవారం ఉదయం 9 గంటలకు జరగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

జగనన్న ఇళ్లను ప్రారంభించిన డిప్యూటీ సీఎం

మాడుగుల రూరల్: కేజేపురం పంచాయతీ శివారు తెలకలదీపంలో జగనన్న లేఅవుట్లలో పెంటకోట నూకరత్నం, కోయిలాడ సుబ్బలక్ష్మి నిర్మించుకున్న రెండిళ్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కుల,మతాలు, పార్టీలు చూడకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.